ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





నిండిపోయిన ఎన్టీయార్ జలాశయం - జీడీ నెల్లూరు మండలం ముక్కళత్తూరు దళితవాడలో పూరిగుడిసె కోల్పోయిన రాజేశ్వరికి ప్రభుత్వం తరపున రూ.50వేల చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే థామస్

ముసురువానతో ఖాళీగా చిత్తూరు రోడ్లు



రోజంతా ముసురు వాన
స్తంభించిన జనజీవనం

- దెబ్బతిన్న పది గుడిసెలు, 50 చెరువులు
- నేటి నుంచి తెరుచుకోనున్న విద్యాసంస్థలు



ఐరాల మండలం మొరప వడ్డిపల్లెలో నేల వాలిన వరి పంట

చిత్తూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం మంగళవారం చెప్పుకోదగ్గ స్థాయిలో లేకున్నా రోజంతా ముసురు వాన కారణంగా జన జీవనం స్తంభించింది. వాతావరణ శాఖ హెచ్చరికల కారణంగా ప్రజలు కూడా పెద్దగా బయటికి రాకుండా పనుల్ని వాయిదా వేసుకున్నారు. వాహనాలు పెద్దగా రోడ్లపై తిరగలేదు. ఆర్టీసీ బస్సులు తిరిగినా ప్రయాణికులు పెద్దగా కన్పించలేదు. చాలావరకు సినిమా హాళ్లు, దుకాణాలు, హోటళ్లు కూడా తెరుచుకోలేదు.

అంగన్వాడీలకు మాత్రమే సెలవు

తుఫాను ప్రభావ హెచ్చరికలతో సోమ, మంగళవారాలు జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే.మంగళవారంతో తుఫాను ప్రభావం తగ్గిన కారణంగా బుధవారం నుంచి విద్యాసంస్థలు యథావిధిగా పనిచేస్తాయని కలెక్టర్ ప్రకటించారు.అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే బుధవారం సెలవు ప్రకటించారు.

చిన్నపాటి నష్టం ఇలా..

వర్షాల కారణంగా గత రెండు రోజుల్లో 10 పూరి గుడిసెలు దెబ్బతినగా, ప్రభుత్వం రూ.50 వేల చొప్పున మంజూరు చేసింది. ఇప్పటికే ఐదుగురు బాధితులకు పంపిణీ చేయగా, రెండు మూడు రోజుల్లో మిగిలినవారికీ అందించనున్నారు. జిల్లాలో 75 శాతం చెరువులు నిండిపోగా, సుమారు 50 చెరువులు డ్యామేజ్ అయ్యాయి. అక్కడక్కడ రోడ్లు, కల్వర్టులు కూడా ఛిద్రమయ్యాయి. 300 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్తు శాఖకు చెప్పుకోదగ్గ నష్టం జరగలేదు. నగరి ప్రాంతంలో చలి కారణంగా ఓ పశువు మృతి చెందింది.జిల్లా కేంద్రమైన చిత్తూరులో మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినా నిర్వాసితుల్ని ఉంచాల్సిన అవసరం రాలేదు.నగరి మండలం వేలావడి ఎస్టీ కాలనీవాసులను సమీపంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.ఎమ్మెల్యే భానుప్రకాష్ ఈ కేంద్రాన్ని సందర్శించి బాధితులను పలకరించారు.

సమృద్ధిగా భూగర్భజలాలు

వరుస వర్షాల కారణంగా జిల్లాలో భూగర్భజలాలు బాగా పెరిగాయి. 2021 చివర్లో నివర్ తుఫాను జిల్లాను అతలాకుతలం చేసింది. పెద్దఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాలను మిగిల్చింది. 2021-22లో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున భూగర్భజలాలు పెరిగాయి.ఇప్పుడు అదే పరిస్థితి పునరావృతమైంది. అక్టోబరు నెలకు సంబంధించి జిల్లా సాధారణ వర్షపాతం 151.7 మి.మీ కాగా, మంగళవారం నాటికి 292.4 మి.మీలుగా ఉంది. అంటే దాదాపు రెట్టింపు వర్షపాతం నమోదైంది.

యంత్రాంగం అప్రమత్తం

ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారి పీఎస్ గిరీషా సోమవారం చిత్తూరు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జీడీనెల్లూరు ప్రాంతంలో పర్యటించారు. మంగళవారం కార్వేటినగరంలోని కృష్ణాపురం జలాశయంతో పాటు నగరి ప్రాంతంలో పర్యటించి తుఫాను పరిస్థితుల్ని పర్యవేక్షించారు. ఆర్డీవో తదితర అధికారులు వారి పరిధిలోని చెరువులు, రోడ్ల డ్యామేజీలను పరిశీలించారు.కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.గంటలకోసారి టెలీ, వీడియో కాన్ఫరెన్సులను నిర్వహించి మండలస్థాయి అధికారులను అప్రమత్తం చేస్తూ, తుపాను పరిస్థితిని పర్యవేక్షించారు.

నిధుల ఖర్చు

తుపాను సహాయక చర్యల కోసం ప్రభుత్వం జిల్లాకు రెండు విడతల్లో రూ.2.50 కోట్లను విడుదల చేయగా, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆయా అవసరాలకు ఆ నిధుల్ని ఖర్చు చేస్తున్నారు.పడిపోయిన 5 ఇళ్లకు పరిహారంగా ఇప్పటికే రూ.50వేల చొప్పున అందించగా, మరో 5 ఇళ్లకు ఇవ్వనున్నారు. అలాగే ఈ నెల 13న చిత్తూరు రూరల్ మండలంలో పిడుగు పడి మరణించిన ఓ యువకుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం మంజూరు చేశారు. చెరువుల, రోడ్ల డ్యామేజీని అంచనా వేసి మరమ్మతు పనులు చేపట్టనున్నారు.



నగరి మండలం వేలావడి ఎస్టీ కాలనీ పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

300 ఎకరాల్లో వరి పంటకు నష్టం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా 300 ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారులు లెక్కలు కట్టారు. 12 మండలాల పరిధిలోని 71 గ్రామాల్లో 247 మంది రైతులు 293 ఎకరాల్లో సాగు చేసిన వరి, ఏడు ఎకరాల్లో వేరుశనగ పంట దెబ్బతింది. అత్యధికంగా గుడిపాల మండలంలో 12 గ్రామాల్లోని 55 ఎకరాల్లో వరి పైరు దెబ్బతింది. యాదమరి మండలంలో ఐదు గ్రామాల్లోని 12.25 ఎకరాల్లో వరిపైరు, తవణంపల్లెలో మూడు గ్రామాల్లోని 6.5 ఎకరాల్లో, పెనుమూరులో 10 గ్రామాల్లో 70 ఎకరాలు, బంగారుపాళ్యంలో నాలుగు గ్రామాల్లో 12.5 ఎకరాలు, పూతలపట్టులో 14 ఎకరాలు, ఐరాలలో 8 గ్రామాల్లో 28 ఎకరాలు, వెదురుకుప్పంలో 7 గ్రామాల్లో 34.75 ఎకరాలు, సోమలలో రెండు గ్రామాల్లో 3 ఎకరాలు, ఎస్ఆర్‌పురంలో ఐదు గ్రామాల్లో 11.25 ఎకరాలు, జీడీ నెల్లూరులోని ఆరు గ్రామాల్లో 39.75 ఎకరాలు, పాలసముద్రంలోని మూడు గ్రామాల్లో ఆరు ఎకరాల్లో వరిపైరు దెబ్బతింది. కాగా గుడిపాల మండలంలో 3 ఎకరాలు, పూతలపట్టులో 1.8 ఎకరాలు, జీడీ నెల్లూరులో 3 ఎకరాల్లో వేరుశనగ పంట దెబ్బతింది.



పలమనేరు మండలంలో వర్షాలకు దెబ్బతిన్న టమోటా పంట

30 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో రెండు మండలాలు మినహా 30 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. అత్యధికంగా విజయపురం మండలంలో 26 మిమీ, అత్యల్పంగా కుప్పం మండలంలో 0.4 మిమీ వర్షం కురిసింది. మండలాల వారీగా నింద్రలో 25.6, నగరిలో 22.6, కార్వేటినగరంలో 12.8, ఐరాలలో 11.6, పులిచెర్లలో 9.8, వెదురుకుప్పంలో 9.2, శ్రీరంగరాజపురం, వి.కోట మండలాల్లో 9, పూతలపట్టులో 7.4, పాలసముద్రంలో 6.4, తవణంపల్లెలో 6, పెనుమూరు, గుడిపాల మండలాల్లో 5.4, గంగవరం, రొంపిచెర్ల మండలాల్లో 5, గంగాధరనెల్లూరు, చిత్తూరు మండలాల్లో 4.6, శాంతిపురంలో 4.4, సదుం, పుంగనూరు మండలాల్లో 4.2, పలమనేరులో 3.6, బంగారుపాళ్యం, యాదమరి మండలాల్లో 3.2, రామకుప్పంలో 2.8, చిత్తూరు అర్బన్, సోమల మండలాల్లో 2.4, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లె మండలాల్లో 2.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

CTBTA
DATE 29-10-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION

టుడే సప్లై రేట్ 130/-	డ్రెస్డ్ స్కిన్‌తో 234/-
రిటైల్ లైవ్ బర్డ్ 155/-	స్కిన్‌లెస్ 259/-



టీటీడీ బోర్డు సమావేశంలో చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో సింఘాల్, సభ్యులు

రూ.25 కోట్లతో కాణిపాకంలో
టీటీడీ వసతి సముదాయం

దేవస్థానాల ఆస్పత్రులకు డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్

వెల్లడించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద యాత్రికుల వసతి సముదాయం, ఏసీ, నాన్ ఏసీ కల్యాణమండపాల నిర్మాణం కోసం రూ.25 కోట్లు కేటాయించినట్లు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. నిధులు టీటీడీ కేటాయించినప్పటికీ నిర్మాణ, నిర్వాహణ బాధ్యతలు కాణిపాకం ట్రస్టు బోర్డువే అన్నారు.అక్కడి స్థానిక ప్రజాప్రతినిధి ప్రతిపాదన మేరకు ఈ ప్రాజెక్టును తమ బోర్డు ఆమోదించిందన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ అనుమతి కోరుతామన్నారు.తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం దాదాపు ఏడు గంటల పాటు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులతో కలిసి బీఆర్ నాయుడు మీడియాకు బోర్డు నిర్ణయాలు వెల్లడించారు.స్విమ్స్ పరిధిలో ఉన్న కొన్ని మెడికల్ షాప్‌లు నకిలీ మందులు విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో స్విమ్స్ ఆధ్వర్యంలోనే మెడికల్ షాప్‌ను నిర్వహిస్తే బాగుంటుందని నిర్ణయించామన్నారు. శ్రీవాణి ట్రస్టు దాతలు టికెట్లు తీసుకునేందుకు తిరుమలలో ఇబ్బందులు పడుతున్న అంశంపై కూడా చర్చించామని రానున్న పదిరోజుల్లో ఈ అంశంపై ఓ నిర్ణయం వెల్లడిస్తామన్నారు. టీటీడీలోకి కాంట్రాక్ట్ లెక్చరర్లు, డ్రైవర్ల క్రమబద్ధీకరణ విషయంలో కూడా తాజాగా మరో తీర్మానం చేశామన్నారు. గతంలో బోర్డు తీర్మానం చేసినప్పటికీ సరైన పద్ధతిలో లేకపోవడంతో తాజాగా మరోసారి పక్కాగా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు.టీటీడీ పరిధిలోని ఆస్పత్రులకు డాక్టర్ జగదీష్ డైరెక్టర్‌గా ఉంటారని ఓ ప్రశ్నకు బదులుగా చెప్పారు. దీనిపై సీఎంవో నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇక, ఏఐ ద్వారా శ్రీవారి దర్శనాల అమలుపై ఇప్పటికే ఓ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, మరికొన్ని టెక్నాలజీల వినియోగంపై కమిటీని నియమించామన్నారు. ఇటీవల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అద్భుతంగా జరిగాయని బీఆర్ నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసు, టీటీడీ అధికారులు, ఉద్యోగులు, బోర్డు సభ్యులు, మీడియా, సేవకులందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. బ్రహ్మోత్సవాల్లో పనిచేసిన టీటీడీ శాశ్వత ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7,535 చొప్పున బ్రహ్మోత్సవ బహుమానం అందించాలని నిర్ణయించామన్నారు. తిరుమల, తిరుపతికి చెందిన సిబ్బందికి అదనంగా రూ.10 శాతం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

'ఆర్థిక' నిధులు రూ.1.43 కోట్ల విడుదల

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. 2024 - 25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత వడ్డీ నిధుల రూపేణా టైడ్ పద్దు కింద రూ.85,33,957, బేసిక్ పద్దు కింద రూ.58,57,346 వెరసి రూ.1,43,91,303 విడుదల అయ్యాయి. ఈ మొత్తాన్ని కోర్టు వివాదాల్లో వున్న గ్రామ పంచాయతీలను మినహాయించి 684 పంచాయతీల ఖాతాలకు త్వరలో జమచేస్తారు.పంచాయతీల్లో శాశ్వత పనుల నిర్మాణాలకు ఈ నిధులను వెచ్చిస్తారు.

17 నుంచి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

తిరుమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం సాయంత్రం బోర్డు సమావేశం అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నవంబరు 17 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాల తరహాలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను కూడా జరుపుతామన్నారు. 11వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న లక్ష కుంకుమార్చన, అంకురార్పణ, 17న ధ్వజారోహణం, 21న గజవాహన సేవ, 22న స్వర్ణరథం, గరుడవాహన సేవ, 24న రథోత్సవం, 25న పంచమితీర్థం, 26న పుష్పయాగం నిర్వహిస్తామన్నారు.

16,608 మంది రైతులకు ఆధార్ సీడింగ్ ఫీజు మినహాయింపు

వెబ్‌ల్యాండ్‌లో తప్పులు సరిదిద్దేందుకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 16,608మంది రైతుల వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఆధార్ సీడింగ్‌లో లోపాలు సరిదిద్దేందుకు వీలుగా మీ-సేవ ఫీజు రూ.50 మినహాయిస్తూ రెవిన్యూ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. వెబ్‌ల్యాండ్ పరిధిలోని రికార్డుల్లో 16,608 రైతుల భూముల రికార్డులతో ఆధార్ డేటా సరిగ్గా ఎంటర్ కాలేదు. కొందరు ఇతరుల సీడింగ్ చేయగా, మరికొందరు తప్పుగా చేశారు. తప్పుగా ఆధార్ మ్యాపింగ్, ఒకే ఆధార్ నెంబర్ ఒక్కసారి కంటే ఎక్కువ పట్టాదారులకు లింక్ కావడం, ఆధార్ లింక్ కాని పట్టాదారులు ఉండడంతో ఈ తప్పులు జరిగాయి.దీంతో జిల్లాలోని 16,608 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి ప్రయోజనం దక్కలేదు. ఈ నేపథ్యంలో ఈ రైతులందరికీ ఒక్కసారి అవకాశమిచ్చి వెంటనే మీ-సేవ కేంద్రాల ద్వారా ఆధార్ సీడింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని రెవిన్యూ, వ్యవసాయశాఖల అధికారులు కోరుతున్నారు.ఈ సదుపాయం 'అన్నదాత సుఖీభవ' పథకం కింద ధ్రువీకరించబడిన రైతులకు మాత్రమే వర్తిస్తుంది.

విధులకు డుమ్మా కొట్టిన ఉద్యోగులకు నోటీసులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో సోమవారం విధులకు గైర్హాజరైన ఉద్యోగులకు ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ఉద్యోగుల గైర్హాజరుపై మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో సచివాలయంలో సిబ్బంది ఏరీ? శీర్షికన వార్త ప్రచురితం కావడంపై జిల్లా అధికారులు సీరియస్ ఆయ్యారు.సోమవారం అందుబాటులో లేని ఉద్యోగులకు ఎంపీడీవో శ్రీనివాస్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.అలాగే పలు సచివాలయాలను తనిఖీ చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏఐసీఎస్ ఎంపిక పోటీల వాయిదా

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆలిండియా సివిల్ సర్వీస్(ఏఐసీఎస్) క్రీడా పోటీలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈమేకు సంబంధిత సివిల్ సర్వీస్ అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో
20ఏళ్ల జైలు, జరిమానా



కల్యాణ్

పుంగనూరు రూరల్/ పూతలపట్టు, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన పుంగనూరు మండలం ఉలవలదిన్నె యువకుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ చిత్తూరు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం.శంకర్‌రావు మంగళవారం తీర్పు ఇచ్చారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి,సీఐ సుబ్బరాయుడు కథనం మేరకు.... పుంగనూరు మండలంలోని ఓ బాలిక (13) పుంగనూరులో చదువుకుంటుండగా భీమగానిపల్లె పంచాయతీ ఉలవలదిన్నెకు చెందిన పూజారి కల్యాణ్(28) పరిచయం పెంచుకున్నాడు. 2019 ఏప్రిల్ 18వ తేది పెళ్లి చేసుకుంటానని నమ్మించి పాఠశాల నుంచి మంగళంకాలనీ సమీపంలో నల్లరాళ్లగంగమ్మ గుడి సమీపంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు.తరువాత బెంగళూరు తీసుకెళ్లి అద్దె ఇంటిలో ఉంచాడు.మూడురోజుల తరువాత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేశారు. 23వతేది బెంగళూరు నుంచి వారిని తీసుకొచ్చి 24వ తేదిన కల్యాణ్‌ను రిమాండ్‌కు తరలించారు.ఈ కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయమూర్తి శంకర్‌రావు నిందితుడు కల్యాణ్‌కు 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.బాధితురాలికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలన్నారు.ముద్దాయికి శిక్ష పడడానికి కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ బాలకృష్ణ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇంచార్జి చంద్రశేఖర్, పుంగనూరు సీఐ సుబ్బరాయుడును ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లిమిటెడ్, చిత్తూరు జిల్లా

2వ అంతస్తు, వివేకానంద భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరు జిల్లా.

2025-27 సంవత్సరమునకు సంబంధించి ప్రజా పంపిణీ పథకం క్రింద స్టేజి-II ద్వారా ఆహార ధాన్యములు మరియు ఇతర నిత్యవసర వస్తువులు రవాణా చేయుట కొరకై

రీ - టెండరు (షార్ట్ నోటీసు)

నం.పి.డి.ఎస్/6/స్టేజి-II/చిత్తూరు 2025-27 తే : 28-10-2025

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, చిత్తూరు వారి తరపున జిల్లా లోని మండల స్థాయి గోదాముల నుండి / నిల్వ గోదాముల నుండి వాటికి అనుసంధానింపబడిన మండలాలలోని చౌక ధర దుకాణములకు, స్కూల్స్, హాస్టల్స్ మరియు ఐ.సి.డి.ఎస్ కేంద్రాలకు ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేర్కొనబడు ఇతర ప్రదేశాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేయు బియ్యం మరియు ఇతర నిత్యావసర వస్తువులను 2025-27 (అగ్రిమెంట్ తేది నుండి 31-3-2027 వరకు) సంవత్సరములకు స్టేజి II క్రింద రవాణా చేయుటకు ఆన్లైన్ రీ - టెండరు కోరబడుచున్నవి. మండల స్థాయి గోదాములు ఈ కేంద్రములలో కలవు. 1) గంగాధర నెల్లూరు, 2) పూతలపట్టు, 3) కార్వేటినగరం, 4) పచ్చికాపాలెం మరియు 5) నగరి.

స్టేజ్- II రవాణా కాంట్రాక్టుకు సంబంధించిన రీ-టెండరు ప్రక్రియ పూర్తిగా AP e-procurement పోర్టల్ నందు మాత్రమే జరుగును. **(website Address : https://tender.apeprocurement.gov.in).**

ఆసక్తి గల రవాణాదారుడు/ సంస్థ https://tender.apeprocurement.gov.in website ను సందర్శించి బిడ్ డాక్యుమెంట్ మరియు రీ- టెండరు ప్రకటన వివరాలను పొందవచ్చును. అదేవిధంగా టెండరును దాఖలు చేయుటకు పైన తెలిపిన website నందు రిజిస్టర్ చేసుకుని రూ.5900/- @ 18% GST తో కలుపుకొని టెండర్ షెడ్యూల్ కొరకు ఆన్‌లైన్ ద్వార చెల్లించి టెండరు డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోగలరు.

AP e-procurement పోర్టల్ నందు టెండరు డాక్యుమెంట్ పొందవలసిన మరియు అప్‌లోడ్ చేయవలసిన తేది మరియు సమయముల వివరములు

వివరములు తేదీ మరియు సమయము

1. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ 29-10-2025 ఉ॥ 10.30 గంటల నుండి
2. ఆన్‌లైన్ బిడ్‌లు స్వీకరణకు చివరి తేదీ 09-11-2025 సా॥ 5.00 గంటలకు.
3. టెక్నికల్ టెండర్స్ పరిశీలించు తేది 10-11-2025 ఉ॥ 11.00 గంటలకు
4. ఫైనాన్షియల్ బిడ్ పరిశీలించు తేదీ 11-11-2025 ఉ॥ 11.30 గంటల నుండి.

సం/- జిల్లా కలెక్టర్ మరియు పదవి రీత్యా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చిత్తూరు జిల్లా.

తిరుమల అడవుల్లో అరుదైన బల్లి

● వెంకటాద్రిగా నామకరణం



మంగళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండల్లో అరుదైన ఒక బల్లిజాతిని గుర్తించారు. దట్టమైన చందనపు అడవిలో చెట్టు బెరడు కింద దీనిని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి వెంకటాద్రి స్లెండర్ గెక్కో అని పేరు కూడా పెట్టారు. పలుచని తొండలా కనిపించే బల్లిజాతి జీవి ఇది. హెర్పటోజోవా అనే అంతర్జాతీయ జర్నల్‌లో ఈ వివరాలను శాస్త్రవేత్తలు ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెష్‌వాటర్ బయాలజీ రీజనల్ సెంటర్, కోల్‌కత్తకి చెందిన రెప్టిల్లా విభాగం, ఒడిస్సాలోని ఫకీర్ మోహన్ యూనివర్శిటీల శాస్త్రవేత్తల బృందం శేషాచలం అడవుల్లో దీనిని గుర్తించింది.

శ్రీవారిసేవలో ప్రముఖులు






అభిమానితో సెల్ఫీ తీసుకుంటున్న అజిత్ - అన్మోల్ అంబానీ, క్రిషా షా అంబానీ దంపతులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో, తమిళ హీరో అజిత్, ప్రముఖ పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీ, ఆయన సతీమణి క్రిషా షా అంబానీ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 8 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.47 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,842

తలనీలాలు సమర్పించినవారు: 25,125

వాన.. గాలి.. చలి!



తిరుమలకు శ్రీనివాసుడి దర్శనానికి వస్తున్న భక్తులకు విడవని వానలతో అవస్థలు తప్పడంలేదు. తల తడవకుండా గొడుగు విప్పితే ఈదురు గాలులకు తిరగబడిపోతున్నాయి. మరోవైపు చలి వణికిస్తోంది. ఆలయం పరిసరాల్లో మంగళవారం పగలు కనిపించిన దృశ్యాలు ఇవి.

- స్టాఫ్ ఫోటోగ్రాఫర్, తిరుపతి ఆంధ్రజ్యోతి

అత్యవసర వేళ విధులకు డుమ్మా!

● పలు సచివాలయాలకు తాళాలు

● అందుబాటులో లేని అధికారులు, ఉద్యోగులు

● కలెక్టర్ పరిశీలనలో వెల్లడి



తడ మండలం పూడి సచివాలయానికి తాళాలు వేసి ఉండటాన్ని సెల్‌ఫోన్ లైటింగ్‌లో చూపుతున్న తహసిల్దారు

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాను ముంచుకొస్తున్న అత్యవసర వేళ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల్సిన పలువురు అధికారులు, ఉద్యోగులు డుమ్మా కొడుతున్నారు. గ్రామ సచివాలయాలకే కాదు మండల స్థాయి కార్యాలయాలకూ తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు జిల్లా అధికారులు ప్రయత్నిస్తే పలువురు అందుబాటులో వుండడం లేదు. కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలనలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. తుఫాను నేపథ్యంలో సోమవారం రాత్రి ఎంపీడీవోలు, తహసిల్దార్లు కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో కార్యదర్శులూ విధుల్లో వుండాలని ఐదుగురికి చొప్పున డ్యూటీ వేశారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కలెక్టర్ వెంకటేశ్వర్ చిత్తూరు, నెల్లూరు జడ్పీల సీఈవోలతో కలసి మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. చిట్టమూరు ఎంపీడీవో స్థానికంగా లేరని, వాకాడులో ఉన్నట్లు గుర్తించారు. చిల్లకూరు ఎంపీడీవో అందుబాటులోకి రాలేదు. పుత్తూరు అధికారి తిరుపతిలో ఉన్నట్లు, సూళ్లూరుపేట స్పెషలాఫీసర్ సైతం అందుబాటులో లేరని కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు విషయం ఒకరి నుంచీ ఒకరికి సమాచారం వెళ్ళడంతో అందుబాటులో లేని అధికారులూ ఉరుకుల పరుగుల మీద కార్యాలయాలకు చేరుకున్నట్టు సమాచారం.

సచివాయాల్లోనూ అదే తీరు

ఇక సచివాలయాల్లో పరిస్థితి ఎలా ఉందోనని జిల్లా అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేశారు. తడ తహసిల్దారు రాత్రి 10.24 గంటలకు పూడి సచివాలయానికి వెళ్లగా తాళాలు వేసుంది. తర్వాత కారూరు సచివాలయానికి వెళ్ళగా అక్కడ డ్యూటీ చేయాల్సిన సిబ్బంది లేకపోగా తుఫాను డ్యూటీతో సంబంధం లేని ఓ ఉద్యోగి మద్యం మత్తులో నిద్రిస్తున్నట్టు గుర్తించారు. ఆపై పెరియవట్టు సచివాలయానికి వెళ్లగా, అక్కడా తాళాలు వేసి ఉంది. చివరగా అండగుండాల సచివాలయం చేరుకోగా అక్కడే తాళాలే కనిపించాయి.

కలెక్టర్ ఆగ్రహం

సోమవారం రాత్రి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు తుఫాను విధులకు డుమ్మా కొట్టడం పట్ల కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు రాత్రింబవళ్ళు సమస్యాత్మక ప్రాంతాలు తిరుగుతుంటే క్షేత్రస్థాయిలో ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటారంటూ వారిని తీవ్రంగా మందలించినట్టు సమాచారం. విధులకు డుమ్మా కొట్టిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిసింది.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో బుధవారం జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ముఖ్యంగా చిట్టమూరు, ఓజిలి, కోట, వాకాడు, దొరవారిసత్రం, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, ఏర్లు, కాజ్‌వేల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా స్పెషలాఫీసర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ కంట్రోల్‌రూమ్‌కు వచ్చే అత్యవసర సమాచారాన్ని అధికారులకూ తెలియజేయాలన్నారు. డీఆర్వో నరసింహులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



గూడూరు రైల్వేస్టేషన్‌లో సేద తీరుతున్న ప్రయాణికులు

విశాఖ- తిరుపతి మార్గంలో పలు రైళ్లు రద్దు

గూడూరు/తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తిరుపతి నుంచి వైజాగ్ వెళ్ళు పలు రైళ్ళు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. పూరీ ఎక్స్‌ప్రెస్ 30వ తేది వరకు రద్దు చేశామన్నారు. మంగళవారం బయలుదేరాల్సిన తిరుమల ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-కాకినాడల మధ్య నడుస్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశామని పేర్కొన్నారు. తిరుపతి-విశాఖ మధ్య నిడిచే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేశారు. దీంతో గూడూరు రైల్వే జంక్షన్ నుంచి ప్రయాణించేవారు ఇబ్బంది పడ్డారు. ఆయా రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు.

వర్ష ప్రభావ ప్రాంతాల్లో ఎమ్మెల్యేల పర్యటన



తిరుపతి గొల్లవానిగుంటలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



రామచంద్రాపురం మండలం రామాపురం పంచాయతీ ఎస్టీ కాలనీలో ఇల్లు కోల్పోయిన వారితో మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



విడవని వర్షం నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం ముళ్లపూడి ఎస్టీకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి



సూళ్లూరుపేట మండలంలోని దొండకాలువ వంతెనపై ప్రవాహ ఉధృతిని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ



ముసురువానతో ఇబ్బంది పడుతున్న వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం ఎస్టీ కాలనీవాసులకు ఆహారాన్ని అందజేస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావిత ప్రాంతాల్లో భారీ వాహనాల రాక పోకలపై ఆంక్షలు విధించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం తెలిపారు. మంగళవారం రాత్రి7గంటల నుంచి భారీ వాహనాలను జాతీయ రహదారుల వెంట ఉన్న హోల్డింగ్ ప్రాంతాల్లో ఆపుతున్నట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసమే ఈ ఆంక్షలని స్పష్టంచేశారు. తక్షణ సాయం కోసం డయల్ 112 లేదా వాట్సాప్ నెంబరు 8099999977 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

భయం గుప్పెట్లోనే తీరప్రాంతాలు

● బిక్కుబిక్కుమంటున్న స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాలు

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని సముద్రతీరప్రాంత..మత్స్యకార గ్రామాలు భయం గుపెట్లోనే ఉన్నాయి. మంగళవారం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం గ్రామాల్లో సముద్రం అలజడులతో ఆందోళన చెందారు. గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం కసురుపై ఉంటూ పెద్ద ఎత్తున అలలు వచ్చాయి. నాలుగో రోజూ చేపలు పట్టెందుకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేదు. 12 గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. సంచార జీవులను కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో చేర్చి వారికి సహాయక చర్యలు చేస్తున్నారు.

తెలుగుగంగ కాలువలో కొట్టుకుపోయిన షరీప్ మృతదేహం లభ్యం

వరదయ్యపాళెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పసివాడి ప్రాణాలు కాపాడాలన్న తపనతో కాలువలో దూకి కొట్టుకుపోయిన డ్రైవర్ మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఈనెల 26న ఆదివారం సాయంత్రం ఉబ్బలమడుగు జలాశయం సమీపంలోని తెలుగుగంగ కాలువలో ఇరిగేషన్ ఏఈ బాబు తన కారు కడగడానికి మనవడు మహిత్, డ్రైవర్ షరీఫ్‌తో వెళ్లారు. కారు కడుగుతుండగా మహిత్ కాలువతో పడిపోవడంతో రక్షించడానికి దూకిన షరీఫ్ కొట్టుకుపోయిన విషయం విదితమే. ఈక్రమంలో ఈనెల 27న సోమవారం మహిత్ మృతదేహం లభ్యం కాగా మంగళవారం చెట్టుకు ఇరుక్కున్న షరీఫ్ మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వెలికి తీశారు. కాగా షరీఫ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబీకులు భోరున విలపించారు.

పరకామణి చోరీ ఘటనపై హైకోర్టులో మరో పిల్

● రవికుమార్ వ్యవహారంపై సీబీఐ లేదా రిటైర్డు జడ్జితో విచారణ జరపాలన్న శాప్ ఛైర్మన్

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో రవికుమార్ చోరీకి పాల్పడిన వ్యవహారం అంతకంతకూ వేడెక్కుతోంది. ఇప్పటికే దీనిపై దాఖలైన ఓ ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరుపుతుండగా తాజాగా మరో పిల్ దాఖలైంది. ఈ వ్యవహారంలో లోతైన దర్యాప్తు జరపాలని కోరుతూ ఈసారి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు హైకోర్టును ఆశ్రయించారు. కోట్లాది మంది భక్తుల కానుకలకు, మనోభావాలకు సంబంధించిన ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి సిట్ ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఏపీ పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులను సభ్యులుగా నియమించాలని కోరారు. లేకుంటే సీబీఐకి లేదా రిటైర్డు హైకోర్టు జడ్జితో విచారణ కమిషన్ అయినా ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. పరకామణిలో చోరీ ఘటనపై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 24-2023 క్రైమ్ నంబరుతో నమోదైన కేసును తిరుపతి కోర్టులో లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవడం వెనుక పెద్ద కుట్ర దాగివుందని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంలో వాస్తవంగా ఏమి జరిగిందో తేల్చేందుకు లోతుగా సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరముందని, ఆ దిశగా ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరారు. రవి నాయుడు దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని, సీబీఐని, ఏపీ ప్రభుత్వాన్ని, దేవదాయ శాఖను, హోమ్ శాఖను, డీజీపీని, టీటీడీ ఈవో, టీటీడీ సీవీఎస్‌వోలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. రవినాయుడు మంగళవారం దాఖలు చేసిన పిల్‌పై ఆయన తరపున సీనియర్ న్యాయవాదులు మెస్సర్స్ ఉమేష్ చంద్ర, వడ్డి సోమశేఖర్, కర్రా మాధవి, కె.హరికృష్ణ తదితరులు హైకోర్టులో వాదనలు వినిపించనున్నారు.

భార్య ఆచూకీ కోసం వెతుకులాట

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన భార్య కోసం 20రోజులుగా వెతుకుతున్నాడో భర్త. బాధితుడు పోలీసులకు ఇచ్చిన పిర్యాదు మేరకు వివరాలిలా... మహబూబ్ నగర్ జిల్లా కొత్తూరు మండలం మేకగూడకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి విజయలక్ష్మి, దంపతులు ఈ నెల 6న తిరుమల వచ్చారు. దర్శనానంతరం వీరు ట్యాక్సీలో తిరుపతి చేరుకున్నారు. నగరంలోని గరుడ వంతన మూడో పిల్లర్ వద్ద ట్యాక్సీ దిగారు. ట్రాఫిక్ రద్దీలో రోడ్డు దాటుతుండగా విజయలక్ష్మి కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన చంద్రశేఖరరెడ్డి దాదాపు వారం రోజుల పాటు వెతికారు. ఫలితం లేకపోవడంతో ఈ నెల 16న ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. మతి స్థిమితం లేని తన భార్య ఆచూకి కోసం అప్పటి నుంచి ఆమె భర్త కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నాడు. పోలీసులను ప్రాధేయపడుతూనే ఉన్నాడు. ఇంతవరకూ వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని చంద్రశేఖరరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పోలీసులు చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

గొడుగుల కింద వ్యాపారం



మంగళవారం జడివాన కురుస్తుండటంతో తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో వ్యాపారులు ఇలా గొడుగుల కింద వ్యాపారం చేశారు. కొనుగోలుదారులు గొడుగులు వేసుకుని రాగా.. మరికొందరు తడిచిపోయారు.

లోపలకు వెళ్లొద్దు



కొద్ది రోజులుగా తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షంతో ఎవరినీ లోపలకు వెళ్లనీయకుండా ఇలా బారికేడ్లు పెట్టారు.

వెంటాడిన మృత్యువు

● రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



రవికుమార్ మృతదేహం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో జరిగిన ప్రమాదంలో కావలికి చెందిన రవికుమార్(56) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కావలికి చెందిన రవికుమార్ కారును డ్రైవ్ చేసుకుంటూ మంగళవారం తెల్లవారుజామున చెన్నైకు బయలుదేరాడు. గూడూరు సమీపంలోని పారిచర్లవారిపాళెం వద్ద వేచివున్న ప్రయాణికుడు జావిద్‌ను కారులో ఎక్కించుకున్నాడు. నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో ఆగిఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. చిన్నపాటి గాయాలతో బయటపడ్డ రవికుమార్, జావిద్ బయటకు వచ్చి కారును పరిశీలిస్తుండగా ఆ మార్గంలో వెళ్తున్న మరో లారీ రవికుమార్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన మైనార్టీ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి జిల్లా మైనార్టీ ఆర్థిక సంస్థ ఈడీ హరినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులై, రెండేళ్ల అనుభవమున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712655686ను సంప్రదించాలని తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు!



విచారణాధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి

రేణిగుంట అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం తనిఖీలు జరిగాయి. ఈ కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. నెల్లూరు డీఐజీ మునిశంకరయ్య నేతృత్వంలో అధికారుల బృందం మధ్యాహ్నం 11.30 నుంచి 1.30 గంటలదాకా కంప్యూటర్లలోని సమాచారాన్ని పరిశీలించారు. ఈసమయంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డి వారి వెంటే ఉన్నారు. కొందరు ప్రయివేటు వ్యక్తులు కూడా కార్యాలయంలో ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ను అధిగమించబోయి ఆర్టీసీ బస్సుల ఢీ

● ఆరుగురికి తీవ్ర గాయాలు.. 18 మందికి స్వల్ప గాయాలు



తీవ్రంగా గాయపడిన నాగమణి - అఫీజ్‌ఖాన్ - గాయపడిన రమణ - గాయపడిన శ్రీధర్



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సులు

పుంగనూరు, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని గూడూరుపల్లె వద్ద మంగళవారం ఇసుక ట్రాక్టర్‌ను అధిగమించబోయి రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి.పోలీసుల కథనం మేరకు... పలమనేరు డిపోకు చెందిన బస్సు పెద్దపంజాణి వైపు వెళుతున్న ఇసుకు ట్రాక్టర్‌ను అధిగమించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. పెద్దపంజాణి మండలం దాసార్ల పల్లెకు చెందిన డ్రైవర్ శ్రీధర్ (28), కదిరికి చెందిన అఫీజ్‌ఖాన్ (60), పుంగనూరుకు చెందిన నాగమణి(55), రామసముద్రం మండలం కేసీపల్లెకు చెందిన రమణ(37), పలమనేరుకు చెందిన శివప్రసాద్(42), ఎర్రగుట్లపల్లెకు చెందిన పి. వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ట్రాక్టర్ డ్రైవర్ రాంపల్లె నారాయణస్వామి (36)తోపాటు బస్సుల్లోని పుంగనూరు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ, లక్ష్మీదేవి, డ్రైవర్ మస్తాన్, శ్రీవిద్య, పవిత్ర, ఎల్లప్ప, చరణ్, అభిలాష్, నిఖిల్, అశోక్ ,అరుణ,అమరనాథరెడ్డి, ఎస్.శివప్ప, నాగమణి, శ్రీనివాసులు, హేమలత, జియాన్, వసంతమ్మ గాయపడ్డారు. పోలీసులు 108 వాహనాల్లో క్షతగాత్రులను పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆర్డీవో భవాని, పుంగనూరు తహసీల్దార్ రాము, ఎంపీఐ సుప్రియ, సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐలు హరిప్రసాద్, కేవీ.రమణ, పుంగనూరు, పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్లు దినేశ్, అల్తాఫ్ గాయపడిన వారిని పరామర్శించారు. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచనతో క్షతగాత్రులకు ఆస్పత్రిలో టీడీపీ నేతలు ఆర్థిక సహాయం అందజేశారు. పుంగనూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ శమిపతి, మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, పోలీసు గిరి, అంజుమాన్ కమిటీ కార్యదర్శి ఇబ్రహీం క్షతగాత్రులకు ఆర్థిక సహాయం అందజేశారు.కూటమి పార్టీల నాయకులు కోలాట వెంకటరమణ, గంగాధర్, చైతన్య రాయల్, నరేశ్‌రాయల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లమడుగు చెరువుకు గండి



ఆళ్లమడుగు చెరువుకు గండికి మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

సోమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో పలు చెరువులు మొరవలు పోతున్నాయి. మంగళవారం తమ్మినాయనపల్లె పంచాయతీలోని ఆళ్లమడుగు చెరువుకు ఎగువ ప్రాంతం నుంచి వర్షపునీరు చేరడంతో గండి పడింది. ఈక్రమంలో తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీవో ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు స్థానిక రైతులతో కలిసి ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి గండిని పూడ్చి మరమ్మతులు చేయించారు. అలాగే సోమల - ఆవులపల్లె ప్రధాన మార్గంలోని గురునాథం చెరువు జలకళ సంతరించుకుని రోడ్డుపైనే నీరు పొంగి ప్రవహిస్తోంది. గండి పడే పరిస్థితిని గుర్తించి వెంటనే అధికారులకు సమాచారంతో అధికారులు వెంటనే చేరుకుని పనులు చేయించారు. అనంతరం స్థానిక సచివాలయాల్లోని కంట్రోల్ రూమ్‌లో వచ్చిన ఫిర్యాదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు . శ్రీనివాసులు, వరాలరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, భాగ్యమ్మ, వేణుగోపాల్ నాయుడు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కుశస్థలి ప్రవాహాన్ని పరిశీలించిన గిరీషా



కుశస్థలినదిపై తెగిన వంతెనను పరిశీలించేందుకు వెళుతున్న ప్రత్యేకాధికారి గిరీషా తదితరులు

నగరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరిలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుశస్థలీనది ప్రాంతాన్ని జిల్లా ప్రత్యేకాధికారి గిరీషా అధికారులతో కలసి మంగళవారం పరిశీలించారు. నదిపై ఉన్న లోతట్టు వంతెన తెగిపోవడంతో పాటు దానిపైగా నీరు వేగంగా పారుతుండడాన్ని గమనించిన ఆయన తెగిన వంతెనను సరిచేసేంత వరకు అటు వైపుగా రాకపోకలు ఆపేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఉన్నారు. మున్సిపల్ పరిధిలోని 17 సచివాలయాల్లో ప్రత్యేక సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చెప్పారు. ప్రజలు తమ ఫిర్యాదుల కొరకు 9949563111, 7330299301, 9884288313 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

10లోపు ఫ్యాక్టరీలు మామిడి మొత్తాలు చెల్లించాలి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మామిడి రైతులకు ఫ్యాక్టరీలు, ర్యాంపు నిర్వాహకులు తగిన మొత్తాలను నవంబరు 10లోపు చెల్లించాలని మామిడి రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లాలోని మామిడి రైతులకు కిలోకు రూ.8ల చొప్పున గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంపు నిర్వాహకులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నేతలు మునీశ్వర్, సురేంద్రన్, హేమలత, మునిరత్నం, మురళి, ఉమాపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న లారీ



లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన బస్సు ముందు భాగం - గాయాలైన బస్సు డ్రైవర్, కండక్టర్

నింద్ర, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సత్యవేడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. పోలీసుల కథనం మేరకు... తిరుపతి నుంచి సత్యవేడుకు వెళుతున్న తిరుమల - సత్యవేడు బస్సును తిరుపతి - చెన్నై జాతీయ రహదారిలో నింద్ర మండలం కొప్పేడు దళితవాడ వద్ద చెన్నై నుంచి కర్ణాటకకు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, కండక్టర్‌లకు గాయాలు కాగా, ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయాలైన కండక్టర్, డ్రైవర్‌లను చికిత్స కోసం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. లారీ డ్రైవర్‌ని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నింద్ర ఎస్ఐ మల్లికార్జున్ తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన 17 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలను నడిపిన వారికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. గత రెండు రోజులుగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తనిఖీల్లో 17 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించి, వారిపై కేసు నమోదు చేశారు. మంగళవారం వారిని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును పరిశీలించిన జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అడవి పంది దాడిలో యువకుడికి గాయాలు

వి.కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం మద్దిమాకులపల్లెకు చెందిన సుధాకర్ కుమారుడు శరత్ (25) పశువులు మేపేందుకు వెళ్తుండగా మంగళవారం అడవి పంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు యువకుడిని వి.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



గాయపడిన శరత్

తిరుపతికి భారీ వర్ష సూచన

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లాకు మొంథా తుఫాను ముప్పు తప్పింది. అయితే దాని ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు సోమవారం రాత్రి నుంచీ మంగళవారం సాయంత్రం వరకూ ఆగకుండా వర్షాలు కురుస్తున్నాయి. తేలికపాటి వర్షాలు కావడంతో జిల్లాలో పెద్దగా ఆస్తి, పంట నష్టాలు సంభవించలేదు. ఏర్పేడు, పెళ్ళకూరు మండలాల్లో పూరి గుడిసెలు కూలిపోగా రేణిగుంట ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తిరుపతి, శ్రీకాళహస్తి, ఏర్పేడు తదితర చోట్ల పల్లపు ప్రాంతాలు జలమయం కాగా ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించింది. లోతట్టు ప్రాంతాలకు చెందిన గిరిజన కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. చెరువులు, రిజర్వాయర్లలోకి నీరు చేరుతోంది. కాగా వరద నీటి ప్రవాహాలు కాజ్‌వేల పైకి రావడం, వర్షాలకు రోడ్లు దెబ్బ తినడం వంటి కారణాలతో జిల్లావ్యాప్తంగా పలు మార్గాల్లో 19 ఆర్టీసీ సర్వీసులు రద్దయ్యాయి. అలాగే తిరుపతి- విశాఖ నడుమ తిరిగే రెండు రైళ్ళు సైతం రద్దయ్యాయి.జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారమంతా ఒక మోస్తరు వర్షం పడుతూనే ఉంది. దీనికి ఈదురుగాలులు తోడవడంతో చలితీవ్రత పెరిగింది. తిరుమలలో భక్తులు చలికి వణికిపోయారు. తిరుపతి రుయాస్పత్రిలోనూ రోగులకు అవస్థలు తప్పలేదు.

పోలీసులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఎస్పీ తుషార్ డూడీ



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది ఆరోగ్యమే ప్రజాస్వామ్యానికి రక్షణ కవచమని, అందువల్ల పోలీసులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పోలీసు వెల్ఫేర్ ఆస్పత్రిలో పోలీసు సిబ్బంది, హోంగార్డులు, మాజీ హోంగార్డుల కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల డ్యూటీ సమయాలు భిన్నంగా ఉంటాయని, సరైన సమయానికి ఆహారం తీసుకోలేని పరిస్థితులు ఉంటాయన్నారు. విధి నిర్వహణలో పోలీసుల ఆరోగ్యం కంటే ప్రజల భద్రత కోసం పనిచేస్తుంటారన్నారు. సకాలంలో వైద్య పరీక్షలుచేయించుకుని ఆరోగ్యపరమైన సమస్యలను ముందుగానే గుర్తించి, తగిన చికిత్స పొంది ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లను అలవరుచుకుని క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఒత్తిడిని తగ్గించడానికి యోగ, ధ్యానం చేయాలన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ల పర్యవేక్షణలో శ్వేద మహిళల బ్యారక్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అమరవీరుల స్ఫూర్తితో రక్తదానం చేసిన పోలీసులు, అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడల్, ఏఎస్పీలు రాజశేఖర్‌రాజు, శివానందకిశోర్, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజరాజుల దాడులు

● కమ్మపల్లి వద్ద పంటల ధ్వంసం





ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట - ఏనుగుల గుంపు జాడను పరిశీలిస్తున్న రేంజర్ థామస్ సుకుమార్ తదితరులు

కల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజరాజుల దాడులు ఆగడం లేదు. పగలంతా అడవిలో ఉంటూ రాత్రి వేళల్లో పంటలను ధ్వంసం చేయడం ఏనుగుల గుంపు పరిపాటిగా పెట్టుకున్నాయి. మండలంలో ఇప్పటి వరకు పంటలను ధ్వంసం చేస్తున్న ఏడు ఏనుగుల గుంపుకు కళ్యాణి డ్యాం‌ను వచ్చిన మరో 9 ఏనుగుల గుంపు జతయ్యాయి. మండలంలోని కమ్మపల్లి పంచాయతీలో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి వెంకటమ్మ చెరువు మార్గంలో కమ్మపల్లి పంచాయతీ దిన్నె ఎస్సీ కాలనీ వద్దకు ఏనుగుల గుంపు చేరుకున్నాయి. బాలిరెడ్డిగారిపల్లిలోని రైతులు మోహన్‌రెడ్డి, మనోజ్, రమణారెడ్డి, దేశిరెడ్డిగారిపల్లిలోని రైతు ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి చెందిన మామిడి, వరి, వేరుశనగ పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి అడవిలోకి తిరుగు ముఖం పట్టిన ఏనుగులు గుంపు బోడబండ వద్దకు చేరుకున్నాయి.

భీమవరం ఘాట్‌లో 9 ఏనుగుల హల్‌చల్

పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి నుంచి తిరుపతికి వెళ్లే మార్గ మధ్యంలోని భీమవరం ఘాట్ రోడ్డులో సోమవారం రాత్రి సుమారు 9 ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న 9 ఏనుగుల గుంపు కొన్నాళ్ల క్రితం తిరుపతి జిల్లా కళ్యాణి డ్యాం వైపు వెళ్లిపోయాయి. అయితే తిరిగి మండలంలోకి రావనుకున్న ఈ ఏనుగుల గుంపు మళ్లీ మండలంలోకి తిరిగి వచ్చాయి. భీమవరం ఘాట్ రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మామిడి తోట సమీపంలో రోడ్డుపై సుమారు 9 ఏనుగుల ఉండటాన్ని అటుగా వెళుతున్న వాహనదారులు గుర్తించారు. సుమారు అర్ధ గంట సేపు రోడ్డుపై ఏనుగుల గుంపు తిష్ఠ వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల నుంచి హారన్లు కొట్టడంతో ఏనుగులు అడవిలోకి వెళ్లిపోయాయి. అడవిలోకి వెళ్లిన ఈ ఏనుగుల గుంపు మండలంలోని దిగుమూర్తివారిపల్లి, వీసీ వడ్డిపల్లి, కొమ్మిరెడ్డిగారిపల్లి మీదుగా తిరుపతి జిల్లా పాకాల మండలంలోని వరదప్ప నాయుడుపేట, పాలగుట్టపల్లి, పొదళ్ల కొత్తూరు, శేషాపురం మీదుగా అడవిలోని బోదబండ వద్దకు చేరుకున్నాయి. కళ్యాణి డ్యాం నుంచి వచ్చిన 9 ఏనుగుల గుంపు మండలం వైపు రావడంతో ఎఫ్ఆర్‌వో థామస్ సుకుమార్, ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవో మధు, కృష్ణమూర్తి ట్రాకర్స్‌తో అడవిలోకి చేరుకున్నారు. ఏనుగుల గుంపు జాడను పరిశీలించారు. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని వారు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం



భూమి పూజలో పాల్గొన్న పీ.ఎస్.మునిరత్నం, టీడీపీ నేతలు, సంస్థ ఎండీ దంపతులు

శాంతిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీ.ఎస్.మునిరత్నం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమ్మవారిపేట వద్ద ఈ-రాయిన్ సంస్థ ఎండీ రాధాకృష్ణన్ ఆధ్వర్యంలో కోయంబత్తూరుకు చెందిన ఈ-రాయిస్ సంస్థ రూ.200 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి పరిశ్రమ స్థాపనకు భూమి పూజ చేశారు. సీఎం చంద్రబాబు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని 28న ఆయన చేతుల మీదుగా వర్చువల్ విధానంలో పరిశ్రమ స్థాపనకు శంఖుస్థాపన చేయాల్సి ఉంది. మొంథా తుఫాన్ కారణంగా ఈ కార్యక్రమం వాయిదా పడటంతో సంస్థ ప్రతినిధులు స్వయంగా మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో భూమి పూజ చేశారు. త్వరలో పరిశ్రమ పనులు పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభం అవుతుందని ఎండీ రాధాకృష్ణన్ తెలిపారు. కార్యక్రమంలో కుప్పం ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, పలమనేరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, రెస్కో డైరెక్టర్ మనోహర్, సంస్థ సీఈవో సుధాకర్‌నాగు, ప్రతినిధులు నందగోపాల్ నాయుడు, మేనేజర్ జే.రమేష్ కడా పీవో ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కులంపేరుతో వేధిస్తున్నాడు

కమర్షియల్ ట్యాక్స్ జేసీపై ఉద్యోగుల ఆరోపణ



చిత్తూరు కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల ధర్నా

చిత్తూరు రూరల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): చిత్తూరు కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ రెడ్డి అటెండర్లను కులం పేరుతో వేధిస్తున్నారని ఆరోపిస్తూ వివిధ ఉద్యోగ సంఘ నాయకులు మంగళవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాఘవులు మాట్లాడుతూ ఇద్దరు అటెండర్లను జేసీ దూషించడం, తన ఛాంబర్‌కు చెప్పులు వేసుకొని రాకూడదనడం దారుణమన్నారు. కమర్షియల్ ట్యాక్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూర్ణం మాట్లాడుతూ జేసీని బదిలీ చేసి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం మాట్లాడుతూ అటెండర్లు లవకుమార్, భరత్‌లను కులం పేరుతో దూషించడమే కాకుండా భరత్‌పై దాడికి పాల్పడడం చాలా బాధాకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య ,నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం మాట్లాడుతూ జేసీని సస్పెండ్ చేయాలన్నారు.లవకుమార్ మాట్లాడుతూ తనను జేసీ కులం పేరుతో తిడుతున్నాడని, కారణం లేకుండా మెమోలు ఇస్తున్నాడని ఆరోపించాడు.భరత్ మాట్లాడుతూ తనతో సమానంగా కార్లో కూర్చుంటావా అని ఎండలో నిలబెడుతున్నారని చెప్పుకొచ్చారు.ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేష్, కమర్షియల్ ట్యాక్స్ క్లాస్‌ఫోర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌నాయక్, కార్యదర్శి మునికృష్ణయ్య, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

యాదకుంట చెరువుకు గండి

● చెరువు కట్టపై రాకపోకలు నిషేధం



యాదకుంట చెరువు మధ్య భాగంలో కుంగి కిందకు జారిపడ్డ కట్ట



చెరువు కట్టపై నాణ్యత లేక బీటలు వారిన రోడ్డు

వి.కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం బైరుపల్లె పంచాయతీ యాదకుంట చెరువు కట్ట మధ్యలో తెగి ఆయకట్టులోకి జారిపడింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వచ్చే నీటితో యాదకుంట చెరువు నిండి మరో రెండు రోజుల్లో మొరవ ప్రవహించే స్థితికి చేరుకుంది. మంగళవారం ఉదయం కట్టపై కొత్తగా వేసిన తారు రోడ్డు బీటలు వారడం, చెరువు కట్టకు దిగువ భాగంలో నీరు లీకవుతుండటం గ్రామస్తులు గుర్తించారు. అప్పటికే చెరువు కట్ట మధ్య భాగం సగం మేరకు తెగి దిగువనున్న ఆయకట్టులో పడింది. రోడ్డు సైతం పెద్దఎత్తున బీటలు వారింది. దీంతో సమాచారం అందుకున్న తహసీల్దార్ ఉదయ్ సంతోష్, సీఐ సోమశేఖర్ ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో కట్ట తెగిపోయే ప్రమాదాన్ని గుర్తించారు. వెంటనే మొరవ వైపు కట్టను ఎక్స్‌కవేటర్‌తో లోతు కాలువ తీయించారు. దీంతో చెరువులో నీటి మట్టం కాస్త తగ్గడంతో చెరువు కట్ట మధ్య భాగం మట్టితో నింపి నీటి లీకేజీని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. యాదకుంట చెరువుకు ఇరువైపులా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. ఆయకట్టు రైతులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హెచ్చరించారు.

కాళంగి జలాశయ గేట్లు మూసివేత

తిరుపతి/కేవీబీపురం/రేణిగుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయం లోతు 224 అడుగులు. మంగళవారానికి 217 అడుగుల నీటి మట్టం ఉంది. దీంతో గేట్లను మూసేశారు. ఒకవేళ మంగళవారం రాత్రికి నీటి మట్టం పెరిగితే 1, 2 గేట్లు ఎత్తే అవకాశం ఉంది. రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాంలో మంగళవారం ఉదయం 8 గంటలకు 800 క్యూసెక్కుల నీళ్లు చేరుతోంది. దీంతో గేట్లను ఒక అడుగు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు వదులుతున్నారు.వాకాడు మండలం స్వర్ణముఖి బ్యారేజీలోకి 3500 క్యూసెక్కుల నీరు వస్తుండగా 7 గేట్లు ఎత్తివేశారు. పిచ్చాటూరు మండలం అరణియార్ రిజర్వాయరులో 31 అడుగులకుగాను 28.7 అడుగులకు నీటి మట్టం చేరింది. 450 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుండగా రెండు గేట్లు ఎత్తివేసి 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్‌లో 867 అడుగుల వరకూ నీటి మట్టం పెరిగింది.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED
Wanted Front Office Manager, Account Manager, Room Boys, Hotel Sunilkrishna, Old Tiruchanoor Road, Tirupati, Cell : 80999 80999, 88866 02345.
AJT - 246485

తుడా అప్రూవల్ ప్లాట్స్
పూర్తి డెవలప్మెంట్‌తో అన్ని డాక్యుమెంట్స్‌తో మీ సొంతం. తిరుపతి, వెంకటగిరి, నాయుడుపేట, రాజంపేట, రైల్వేకోడూరు. పరిసరాలలో అతి తక్కువ రేటుతో ప్లాటు 7 లక్షలు నుండి 30 లక్షలు అరకు స్పాట్ రిజిస్ట్రేషన్ సంప్ర: 72073 20806
AJT -246100

WANTED
తిరుపతి , చెర్లోపల్లి, రేణిగుంటలో సెక్యూరిటీ గార్డ్స్ & హౌస్ కీపింగ్ లేడీస్ నార్త్ ఇండియన్స్ వర్కర్స్ కావలెను. సంప్ర.: 9492741481, 96426 21438
AJT - 1730

REAL ESTATE
PLOTS | FLATS - APARTMENTS | HOUSES | VILLAS FOR SALE: LUCKY VENTURES- India's No.1 Real Estate Company! Cont. : 91145 61456.
AJT - 1751

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 246967

WANTED
Wanted Teachers for Lower section All subjects.good communication skills. Experience 5 yrs. Contact : 99660 52499 / 88012 77691.
AJT - 1750

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ఆర్టీసీ కార్మికుడికి ఆర్థిక సాయం


బాషా కుటుంబానికి నగదు అందజేస్తున్న పీఎస్ఎం, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు

కుప్పం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఆర్టీసీ డిపోలో ఎల్‌హెచ్‌గా పని చేస్తున్న ఎస్‌కే.బాషా ఆరోగ్యం కోసం ఆర్టీసీ ఉద్యోగులు సేకరించిన నగదును ఆర్థిక సాయంగా అందించారు. ఆర్టీసీ డిపోలో ఎల్‌హెచ్‌గా పనిచేస్తున్న ఎస్‌కే.బాషా చాలాకాలంగా కిడ్నీల వ్యాధితో బాధ పడుతూ స్థానిక పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల నుంచి రూ.40 వేలు నగదును సేకరించారు. ఇలా సేకరించిన నగదును మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం చేతులమీదుగా బాధితుడు బాషా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో డిపో ఎంఎఫ్ విజయ్, ఎన్ఎంయూఏ నాయకులు ఎస్.మునస్వామి, ఎంజీ.ప్రసాద్, కుమార్, ఈ.జయపాల్, మునెప్ప, రహంతుల్లా, మొగిలీశ్వర్, జయశంకర్, ఎస్ఆర్.రాజ, సీకే.పుష్పరాజ్, ఎల్లుస్వామి, ఖలీల్, రమణ, పి.బాషా, గోవింద, రాజు, విజయకుమార్, సుభాష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో మారుమూల ప్రాంతాలు


వడ్డిపల్లెలో పర్యటిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతాలు సైతం అభివృద్ధి పథంలో పయనించేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం మున్సిపల్ టీడీపీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్‌తో కలిసి ఆయన మంగళవారం కుప్పం పురపాలక సంఘం 7వ వార్డు, వడ్డిపల్లెలో విస్తృతంగా పర్యటించారు. స్థానికంగా మురుగునీటి కాలువలు తగినంతగా లేకపోవడంతోపాటు తాగునీటి పైపులైన్ల సమస్యలు అధికంగా ఉన్నాయి. ఆయా సమస్యలను స్థానికులు నాయకులకు విన్నవించారు. కాలువలు లేకపోవడంతో మురుగునీటి సమస్య ఎక్కువగా ఉందని విన్నవించారు. అంతేకాక తాగునీటి పైపులైన్లకున్న కుళాయిలు అక్కడక్కడా వీడిపోయి నీటి వృథా జరుగుతుండడాన్ని గమనించారు. దీనిపై రాజ్‌కుమార్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం టౌన్ ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్లు కేటాయించారని చెప్పారు. వడ్డిపల్లె మీదుగా ఈ రింగ్ రోడ్డు వెళ్తున్నందున స్థానికంగా ఉన్న రోడ్లను విస్తరించాలని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మునిమాణిక్యం, రాజేశ్, కమల్, క్రాంతి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మణి, రాజగోపాల్ తదితరులు

కుప్పం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ కుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ఎం.రాజగోపాల్, రాష్ట్ర తెలుగు యువత నాయకుడు చెక్కునత్తం మణి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కుప్పం మండలం వానగుట్టపల్లె పంచాయతీలో మంగళవారం పంచాయతీ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి నెలా గ్రామ సమన్వయ కమిటీ సమావేశాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. నాయకులు గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీ సమన్వయ కమిటీ సభ్యులు రోజుకు ఇద్దరు వంతున సచివాలయాల్లో ఉండాలన్నారు. అక్కడికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో మర్యాదగా మెలగుతూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు. అధికారులపై మర్యాదగా మెలగాలన్నారు. అన్ని బూత్‌లలో పార్టీలో చేరికలపై దృష్టి సారించాలని చెప్పారు. పార్టీ నాయకులు శ్రీనివాసులు, ఎన్ఎస్.శివకుమార్, మురళీ, సంతోష్, రామచంద్ర, రిజ్వాబ్, జకావుల్లా, రవి, అక్మల్, అప్పాజీ, బాబు, రఘు, గోవిందరాజులు, పళణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం


ఆరోగ్య పరీక్షల కోసం తరలివచ్చిన ప్రజలు

కుప్పం రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కుప్పం మం డలం చెక్కునత్తం పంచాయతీ అడవి ములకలపల్లె గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో ప్రజలకు యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని ఈ పరీక్షలు చేయించుకున్నారు. రాష్ట్ర తెలుగు యువత నాయకుడు మణితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి


కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాల్

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆశయాలకనుగుణంగా రాజకీయాలకతీతంగా గ్రామాలను అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని శాంతిపురం సింగిల్‌విండో చైర్మన్ గోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపీపీ వసుంధర అధ్యక్షతన జరిగిన శాంతిపురం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ పట్టాభిశెట్టి, తహసీల్దారు ప్రకాషబాబు, ఎంపీడీవో కుమార్, పలువరు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడికి వీల్‌చైర్ వితరణ


వీల్‌చైర్ అందజేస్తున్న ఆనందకుమార్‌గౌడు

రామకుప్పం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం కావలి మడుగుకు చెందిన వెంకటప్పకు ఎస్.గొల్లపల్లెకు చెందిన ఆనందకుమార్ గౌడ్ వీల్‌చైర్‌ను వితరణగా ఇచ్చారు. మంగళవారం రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్‌తో కలిసి ఆనందకుమార్ వీల్‌చైర్‌ను వెంకటప్పకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బాబు, మంజునాథ్, శీనప్ప, సామప్పలు పాల్గొన్నారు.

పాడిరైతులు జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఏడీహెచ్ శ్రీనివాస నాయుడు

సోమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో పశు పోషకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సోమల పశు సంవర్థకశాఖ ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. మంగళవారం సోమల జయంతి కాలనీలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పశువులక నట్టల నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలను ఎత్తైన ప్రాంతాల్లో ఉంచాలన్నారు. అవసరాలకు అనుగుణంగా పశువులకు మేతను నిల్వ ఉంచుకోవాలని వివరించారు. విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా పశువులను ఉంచాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ చందనప్రియ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ శివకుమార్, రవి తేజ, సురేంద్ర, సుధాకర్ తదితరు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి స్థల పరిశీలన


మార్కెట్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న తదితరులు

పలమనేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఈనెల 31న ప్రమాణ స్వీకారం చేయనుంది. దీంతో మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఆలకుప్పం రాజన్న మార్కెట్‌యార్డును సందర్శించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం అనువైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. పలమనేరు మార్కెట్ కమిటీ సెక్రటరీ సంజీవకుమార్‌తో పాటు పలమనేరు మండలం తెలుగు యువత అధ్యక్షులు మునివెంకటరెడ్డి, బైరెడ్డిపల్లి మండల టీడీపీ అధ్యక్షులు కిషోర్‌గౌడ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన


కాలువలో పూడిక తీయిస్తున్న మున్సిపల్ కమిషనర్

పలమనేరు, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి) : తుఫాన్ కురుస్తున్న వర్షాలకు పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి మంగళవారం ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. పెద్దచెరువు, రఘువీరారెడ్డి కాలనీ, ఎద్దులచెరువు ప్రాంతాలను సందర్శించారు. గాంధీనగర్, ఎద్దులచెరువు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలతో ఆయన మాట్లాడి అప్రమత్తం చేశారు. ముంపు ప్రాంతాల్లోని వారిని పునరావాస కేంద్రానికి చేర్చాలని సూచించారు. శ్రీనర్‌కాలనీ, పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అనువుగా దారులను ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేయించారు. గాంధీనగర్‌లోని ఎంపీపీ పాఠశాల, బజారు వీధిలోని బృందావన్ పాఠశాల, జడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్‌వో అనిల్‌కుమార్, టీపీవో ఇందిర, ఏఈ స్నేహప్రియ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల రక్తదానం


రక్తదానం చేస్తున్న సీఐ మురళీమోహన్

పలమనేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం పలమనేరు ఏరియా ఆస్పత్రిలో పోలీసులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ప్రారంభించారు. పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రమాదపుటంచుల్లో చనకవారిపల్లె గుంట


చనకవారిపల్లె కుంట కట్ట

సదుం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చనకవారిపల్లె గుంటకు గండి పడింది. సమాచారం అందుకున్న తహసీల్దారు ప్రమీల సిబ్బందితో వెళ్లి కుంట పరిస్థితిని పరిశీలించారు. గతంలోనూ తణుకువారిపల్లెకుంటకు గండి పడి పంట నష్టం జరిగింది. దీంతో ఈ దఫా గుంట కింద 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్నప్పటికీ ఎలాంటి సాగు లేదు. కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు గత నెల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డి ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే కుంగిన కట్ట తెగిపోతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మండలంలోని చెరువులు, గుంటలను పరిశీలించాల్సి ఉంది.

ఉద్యాన పంటల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఉద్యాన పంటలకు తెగుళ్లు సోకకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పుంగనూరు ఉద్యానవనశాఖ అధికారి వరప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటసాగు తోటలో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, తెగుళ్ల నివారణకు రిడోమిల్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.

ఉధృతంగా కౌండిన్య పరవళ్లు

● మొరవబోతున్న చెరువులు ● దెబ్బతిన్న పంటలు


పలమనేరు: ఉధృతంగా పరవళ్లు తొక్కుతున్న కౌండిన్య నది


పలమనేరు: వర్షాలకు నేలవాలిన వరిపంట


జల్లిపేట వద్ద వంతెనపై వెళ్తున్న కౌండిన్య నదిని పరిశీలిస్తున్న అధికారులు


సింగిరిగుంట సమీపంలో మొరవబోతున్న పెద్ద చెరువు


చౌడేపల్లె : పైపుల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి, ఇరిగేషన్ డీఈ ప్రసాద్

పలమనేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలో కౌండిన్య నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దార్ ఇన్బనాథన్, ఎంపీడీవో భాస్కర్ మంగళవారం పర్యటించారు. మండలలోని కురప్పల్లి వద్ద కౌండిన్య నదిపై నిర్మించిన వంతెనపై పెద్దఎత్తున కౌండిన్యనీరు ప్రవహిస్తున్నందున రోడ్డుపై రాళ్లుపెట్టి రాకపోకలను నిలిపేశారు. కురప్పల్లి వద్ద కౌండిన్యనదిపై నిర్మించిన వంతెన పక్కనే గతంలో వర్షాలు కురిసి వంతెన దెబ్బతిన్న సందర్భంగా చేసిన తాత్కాలిక మరమ్మతులు దెబ్బతిని మళ్లీ వంతెన పక్కనే గండిపడి నీరు వెళ్తోంది. అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని కురప్పల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

● చౌడేపల్లె, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు మొరవబోతున్నాయి. మంగళవారం మండలంలో మొంథా తుఫాన్‌తో ఉదయం వర్షం కురుస్తూనే ఉంది. తెల్లనీళ్లపల్లె వద్ద ఎర్రసిద్దచెరువు నిండి మొరవబోయేందుకు గ్రామంలోకి వెళ్లే రోడ్డు అడ్డుగా ఉంది. గుర్తించిన టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి ఎక్స్‌కవేటరుతో రోడ్డును తొలగించి పెద్ద పెద్ద సిమెంట్ పైపులను ఏర్పాటు చేయించారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ పార్వతి, ఇరిగేషన్ డీఈ ప్రసాద్ పరిశీలించారు. అలాగే సింగిరిగుంట సమీపంలోని పెద్దచెరువు మొరవ పోతుండటంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పశువులు వర్షం కారణంగా మేతకు ఇబ్బందులు పడుతున్నాయి.


పలమనేరు: కురప్పల్లి వద్ద వంతెన పక్కనే గండిపడి వెళ్తున్న నీరు


చౌడేపల్లె: గడ్డంవారిపల్లె వద్ద నీట మునిగిన వరి పైరు

● పలమనేరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడుగా తుఫాన్ కారణంగా ముసురు పట్టుకోవడంతో ఇక్కడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షాల కారణంగా టమోటా, బీన్స్, బీర, కాకర తోటలు దెబ్బతిన్నాయి. కోతకొచ్చిన వరి పంటలు నేలవాలాయి. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికందక నష్టం జరుగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం


రాశీవనంలో కార్తీకదీపాల వెలుగులు

రామకుప్పం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీమాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆలయ ఆవరణతోపాటు వెనుక భాగంలోని రాశీ వనాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులు వెలిగించిన కార్తీక దీపాల వెలుగులతో ఆలయ ఆవరణ శోభాయమానంగా దర్శనమిచ్చింది.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి


రక్తదానం చేస్తున్న యువకులు

పుంగనూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేసి అపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత తీసుకోవాలని పుంగనూరు సీఐ సుబ్బరాయుడు కోరారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి 42 యూనిట్లు రక్తం సేకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సురేశ్, పట్టణంలోని యువకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు


విద్యార్థులకు ఆరోగ్య సలహాలు అందజేస్తున్న వైద్యాధికారి పూజిత

రామకుప్పం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్టీ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పలువరు విద్యార్థులకు మాత్రలు, సిరప్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: భవాని


చంద్రమాకులపల్లె వద్ద నిండిన చెరువులు పరిశీలిస్తున్న పలమనేరు ఆర్డీవో భవాని

పుంగనూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రమాదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పలమనేరు ఆర్డీవో భవాని ఆదేశించారు. మంగళవారం పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె, బోడేవారిపల్లె పంచాయతీలో నిండిన చెరువులు, మొరవలు, పంటలను పరిశీలించారు. తహసీల్దార్ రాము, ఆర్ఐ పణికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం


పొట్టివారిపల్లె రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

సదుం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సదుం గ్రామం జాంద్రపేట నుంచి పొట్టింవారిపల్లెకు వెళ్లే రహదారిలో తూము చెత్తాచెదారం అడ్డుపడి రోడ్డుపై రెండు అడుగుల మేర వర్షపునీరు ప్రవహిస్తుండటంతో ఇటు పాదచారులకు, అటు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే సదుం నుంచి నడిగడ్డ రోడ్డు దుస్థితిలో ఉండటంతో అడుగడుగునా నీటి నిల్వలతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి


మృతిచెందిన నాగరాజు (ఫైల్ ఫొటో)

సదుం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సదుం గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న నాగరాజు(55) మంగళవారం ఆకస్మికంగా మృ తి చెందాడు. పదేళ్లకు పైగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేసిన ఆయన మృతిపై సర్పంచ్ ఉషారాణి, కార్యాలయ సిబ్బంది తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అతని అంత్యక్రియలకు సర్పంచ్ ఉషారాణి రూ.5 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

సదుం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక దిగువ జాంద్రపేటలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి వారి దేవస్థానంలో బుధవారం స్వా సీతాముల విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 29న నూతన విగ్రహాల గ్రామ ప్రదక్షణ, గణపతి పూజ, వాస్తు శాంతి హోమం, వేద పారాయణం, 30న మహాగణపతి హోమం, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ, 31న యాగపూజ, ప్రాణ ప్రతిష్ఠ, సర్వదర్శనం, కల్యాణోత్సవం, అన్నదానం నిర్వహించనన్నట్లు ఆలయ వ్యవస్థాపకులు నాగభూషణం, గిరిజకుమారి దంపతులు తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చెరువుల పరిశీలన


పెద్దచెరువు మొరవను శుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో రాధారాణి

సదుం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరగమంద పంచాయతీలో మొరవబోతున్న పెద్దచెరువును ఎంపీడీవో రాధారాణి, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు తమ సిబ్బందితో మంగళవారం పరిశీలించారు. ముందస్తు జాగ్రత్త చర్యలపై స్థానిక కార్యదర్శి, ప్రజాప్రతినిధులు, ప్రజలకు తెలియజేశారు. నడిగడ్డ సచివాలయ సిబ్బందికి మొంథా తుఫాన్ ప్రభావంపై సూచనలు, సలహాలు అందజేశారు.

నీట మునిగిన వరిపై రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నీట మునిగిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పుంగనూరు ఏడీఏ శివకుమార్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరి పంటలో నీరు నిల్వ లేకుండా చేయాలని, ధాన్యాలు మొలకెత్తకుండా నీటిని తీసివేసిన తర్వాత ఒక లీటర్ నీటిలో 50 గ్రాముల ఉప్పును కలిపి పిచికారి చేయాలన్నారు. ఉప్పు పిచికారీ చేయడంతో ధాన్యం మొలకెత్తకుండా రంగు మారకుండా ఉంటుందని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



వేలావడి ఎస్టీ కాలనీలో బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచించారు. మంగళవారం నగరి మండల పరిధిలోని వేలావడి ఎస్టీ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీని గిరిజనుల పూరిళ్లలోకి నీరు ప్రవహించడంతో వారికి సమీపంలో ఉన్న పాఠశాల భవనంలో వసతి సౌకర్యం ఏర్పాటు చేశారు. వేలావడి ఎస్టీ కాలనీని ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. అనంతరం పునరావాస కేంద్రంలో గల గిరిజనులను కలిసి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారా... లేదా... అని అడిగి తెలుసుకున్నారు. కుశస్థలినదిపై వంతెన తెగిపోవడంతో ట్రాఫిక్‌కు శాశ్వత పరిష్కారం కల్పించేలా నిధులు మంజూరు చేయించి నూతనంగా నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఇళ్లు పడిపోయిన వారికి స్థలం ఉంటే పక్కా గృహాలను మంజూరు చేయిస్తామని చెప్పారు. వేలావడి ఎస్టీ కాలనీ, నిండ్ర, పుత్తూరు, వడమాలపేట మండలాల్లో ఇళ్లు అధికంగా పడిపోయాయని, అలాంటి వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులకు ఆయన సూచించారు. నగరి పట్టణ పరిధిలోని 1వ వార్డులో డ్రైనేజీ కాలువల వసతులు లేకపోవడంతో నగరిపేట జలమయమైందని స్థానికులు మున్సిపల్ అధికారులకు విన్నవించారు. టీవీ కండ్రిగలో దామరపాకం మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే పర్యటనలో నగరి ఆర్డీవో అనుపమ, తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు బాలాజీ, రాష్ట్ర ఎన్నికల క్షత్రియ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సెల్వమణి, పెరుమాళ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

RVS HOSPITALS
RESEARCH FOUNDATION
RVS KNOWLEDGE DISTRICT, CHITTOOR-517127
మా వైద్య విభాగములు
E.H.S. సౌకర్యం కలదు.
▸ జనరల్ మెడిసిన్ ▸ పీడియాట్రిక్స్
▸ జనరల్ సర్జరీ ▸ కంటి వైద్య విభాగం
▸ ఆర్థోపెడిక్స్ ▸ క్రిటికల్ కేర్
▸ కార్డియాలజీ ▸ చెవి, ముక్కు గొంతు
▸ ప్రసూతి మరియు స్త్రీల వైద్య విభాగం
▸ నెఫ్రాలజీ, యూరాలజీ & డయాలిసిస్
650 పడకల ఆసుపత్రి
ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం
Contact: 7729991055

చెరువుల పరిశీలన

గుడిపాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాలకు సంబంధించిన చెరువులను మంగళవారం అధికారులు పరిశీలించారు. వసంతాపురం వద్ద ఉన్న బంగారక్క చెరువు, కుప్పిగానిపల్లె చెరువును తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శిరీష పరిశీలించి, చేపట్ట వలసి జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇల్లు కూలిపోయిన బాధితురాలికి ఆర్థిక సాయం



విజయమ్మకు చెక్కు అందజేస్తున్న థామస్

శ్రీరంగరాజపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ తెలిపారు. మంగళవారం పెద్ద తయ్యూరులో ఇటీవల వర్షాలకు విజయమ్మకు చెందిన పూరిగుడిసె కూలిపోవడంతో స్పందించిన థామస్ ఆమె ఇంటికి వెళ్లి రూ.50వేల చెక్కును అందించారు. కూటమి ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి క్షీరసముద్రం, జీఎంఆర్‌పురం వాగు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించి, విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ జీఎంఆర్‌పురం గ్రామస్తుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి యుగంధర్, టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, పూజారి నాగారాజు, దశరథ, గంధమనేని రాజశేఖర్ నాయుడు, బాలాజీ నాయుడు, రామకృష్ణ యాదవ్, బల్లా వెంకటేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

కొటార్వేడు కాలనీవాసులకు ఆశ్రయం

వెదురుకుప్పం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొటార్వేడు కాలనీలో వరుసగా కురుస్తున్న వాన వల్ల వరద నీరు ఇంటి ఆవరణల్లోకి రావడం వల్ల ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. నాలుగు ఇళ్లలోకి నీరు చేరడం వల్ల ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారిని సురక్షిత ప్రాంతానికి వీఆర్వో బాబురెడ్డి ఆధ్వర్యంలో తరలించారు. వారికి మూడు రోజులకు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. తాత్కాలికంగా భోజన సదుపాయాలను కల్పించారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం- పంచాయతీ రాజ్ శాఖ
మండల ప్రజాపరిషత్ :: బంగారుపాళ్యం మండలం
టెండరు నోటీసు నం.01/2025-26. తేది 28-10-2025
తగ్గువారిపల్లి గ్రామంలోని అసంపూర్తిగా ఉన్న ఐసిడిఎస్ భవనం పూర్తి చేయుటకు అంచనా వ్యయం రూ.10,00,000/-పనికి టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. టెండర్ ఈ తారీకు 01-11-2025 నుండి 15-11-2025 మధ్యాహ్నం 3-00 గంటల వరకు మండల పరిషత్ కార్యాలయము, బంగారుపాళ్యం మండలం నందు స్వీకరించబడును. తదుపరి వివరములకు మండల పరిషత్ కార్యాలయము బంగారుపాళ్యంను సంప్రదించవలెను.
సం/- మండల పరిషత్ అభివృద్ధి అధికారి, బంగారుపాళ్యం మండలం


శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవస్థానము
అరగొండ గ్రామం, తవణంపల్లె మండలం, చిత్తూరు జిల్లా.
శ్రీ స్వామి వారిని దర్శించండి ! తరించండి !!
1) దర్శన వేళలు ఉ॥ 6.00 గంటల నుండి రాత్రి 9.00 గంటల వరకు
2) దేవస్థానము నందు నిత్య సేవలు, అభిషేకము, ఆకుపూజ, వడమాల, అర్చన, మాస సేవలు, సుదర్శన హోమము, ప్రాకారోత్సవము, మాస అర్చన, మాస ఆకుపూజ మరియు శాశ్వత పూజలు కలవు.
3) వసతి గదులు, కళ్యాణ మండపము కలదు.
4) దేవస్థానము అభివృద్ధికి, అన్నదానమునకు విరాళములు ఇవ్వవలసినదిగా కోరుచున్నాము. మరియు ఆన్‌లైన్ నందు
Sri Ardhagiri Veeranjaneyaswamy Devasthanam
Andhra Pradesh Grameena Bank, Aragonda,
A/c No. 642810004196629. 642810004196612,
IFSC Code : UBINOCG7999
ఆంధ్రజ్యోతి 23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
భక్తులు శ్రీ స్వామి వారిని దర్శించి, సంజీవ రాయ పుష్కరిణి తీర్థము సేవించి దేవుని కృపకు పాత్రులు కాగలరు.
డా॥ కె. మురళీమోహన్ గారు
పూతలపట్టు శాసనసభ్యులు
కార్యనిర్వహణాధికారి
9010074919

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

నగరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి కరకంటేశ్వర స్వామి ఆలయంలో, ఏకాంబరకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్కందషష్ఠి వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి అమ్మ వార్లకు సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించి, భక్తుల దర్శనార్థం మండపం వద్ద ఉంచారు. రాత్రి పుష్పాలంకరణతో స్వామివార్లను ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తుంబ కొత్తచెరువుకు జలకళ

● లీకేజీతో వృథాగా పోతున్న నీరు



కొత్తచెరువుకు ఎడమ వైపు ప్రొటెక్షన్ వాల్ దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు, కుడివైపు ఉన్న తూము శిథిలమైపోవడంతో బయటకెళుతున్న చెరువు నీరు

బంగారుపాళ్యం, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబపాళ్యం కొత్తచెరువు ప్రాజెక్టు గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండి జలకళ సంతరించుకుంది. దీంతో ఎడమ వైపున్న మొరవ ప్రాంతంలో ప్రొటెక్షన్ వాల్ కింది భాగం దెబ్బతినడంతో నీరు లీకేజీవుతోంది. ప్రాజెక్టుకు కుడి వైపు తూము భాగం పూర్తిగా కూలిపోవడంతో అందులోనుంచి కూడా నీరు బయటకు వచ్చేస్తోంది. చెరువుకు ఇరువైపులా ఇలా లీకేజీలు ఉండడంతో కట్ట బలహీనపడి ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు, తుంబ ప్రాజెక్టు నీటి సంఘ చైర్మన్ మురళీమోహన్, సర్పంచు ఉషశ్రీలు తెలిపారు. ఈ విషయం తెలిసి మంగళవారం తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఇరిగేషన్ ఏఈ విజయకుమార్, సీఐ కత్తి శ్రీనివాసులు తుంబ కొత్తచెరువు ప్రాజెక్టును పరిశీలించారు. లీకేజీలు ఉన్న ప్రాంతంలో ఇసుక నింపిన మూటలను వేయాలని నీటి సంఘ చైర్మన్ మురళీమోహన్‌కు సూచించారు. కాగా ఈ ప్రాజెక్టు అటవీశాఖ ఆధీనంలో ఉన్నందున అటవీశాఖ, నీటిపారుదల శాఖల సమన్వయంతో ప్రాజెక్టు పనులను పునరుద్ధరించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టును పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ లు పరిశీలించి తుంబ కొత్తచెరువును కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, గురుస్వామి, చిరంజీవి, అభిరాం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నిండ్ర: కైపాకం బీసీ కాలనీలో కూలడానికి సిద్ధంగా ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు, అగరంలో నీటమునిగిన చెరకు విత్తనం - విజయపురం: ఇల్లత్తూరులో మొరవ పారుతున్న పెద్ద చెరువు, శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో నేలకొరిగిన ప్రహరీ గోడ - పాలసముద్రం: టీపీఎన్ఆర్.పురంలో నీట మునిగిన వరిపంట

స్తంభించిన జనజీవనం

● నీటమునిగిన పంటలు
● చెరువులకు చేరుతున్న నీరు
● అప్రమత్తంగా అధికారులు

నిండ్ర, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మండలంలో సోమవారం నుంచి ఎడతెరపి లేని వర్షం కారణంగా జనజీవనం స్తంభించడంతో పాటు పంటలు నీటమునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మంగళవారం తుఫాను ప్రధానంగా ఉంటుందనే నేపథ్యంలో అధికార బృందం తహసీల్దార్ ఈశ్వర్, ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, ఎస్ఐ మల్లికార్జున్ మండలంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి గ్రామాల్లోని సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ చెరువుల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.అగరం పంచాయతీ జయమూర్తి నాయుడుకు చెందిన సుమారు 5 ఎకరాల్లో వారం రోజుల క్రితం అంతర పంటగా సాగు చేసిన చెరకు విత్తనం పూర్తిగా నీటమునగడంతో నాటిన విత్తనం కుళ్లిపోయిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు గుంతలమయంగా ఉండడంతో వాహన దారులకు ఇబ్బందులు పడుతున్నారు.

● విజయపురం: తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, ఆర్అండ్‌బీ జేఈ నర్సింహులు, ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ ప్రత్యేక టీముగా ఏర్పడి మండలంలో ప్రమాదం ఎక్కడ సంభవించడానికి ఆస్కారం ఉంటుందో ఆయా ప్రాంతాలను పర్యవేక్షించి ప్రజలను హెచ్చరించారు. నీట మునిగిన పంటలను వ్యవసాయాధికారి రజనీకుమారి బృందం అంచనా వేస్తున్నారు. సుమారు 25 చెరువులకు పైగా మొరవ పారుతున్నాయి. మాధవరం ప్రభుత్వ ఐటీఐకి ప్రిన్సిపాల్ అధికారికంగా సెలవు మంజూరు చేయకపోవడంతో కొందరు విద్యార్థులు కళాశాల వద్దకు వచ్చి వెనుదిరిగారు. అధ్యాపకులు అవస్థలు పడుతూ కళాశాలకు వచ్చారు. కేవీపురంలో పూరి గుడిసె నేలకూలడంతో హౌసింగ్ ఏఈ ఏళుమలై సందర్శించి సహాయక చర్యలు చేపడతామన్నారు. శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో ప్రహరీ నేల కొరిగింది. కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, పలువురు అధికారులతో పాటు మండల టీడీపీ నాయకులు చుక్కా ధనుంజయయాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబు యాదవ్, మునిభాస్కర్‌రాజు, సుధాకర్‌రాజు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● పాలసముద్రం: మండలంలోని టీపీఎన్ఆర్.పురం, బాలకృష్ణాపురం, ఆముదాల, వనదుర్గాపురం, సింహారాజుపురం గ్రామాల్లో సాగు చేసిన వరి పంట నీటి మునిగింది. వాగులు, వంకలు ప్రవహించి చెరువులన్నీ నిండి కలుజులు పారుతున్నాయి. వర్షం కారణంగా ఇళ్లు వదలి ప్రజలు బయటకు వెళ్లడానికి వీలు లేని పరిస్థితి ఏర్పడింది. గత 15 రోజులుగా వర్షాలు కురిసి పంటలు దెబ్బతిన్నా వ్యవసాయ అధికారులు మాత్రం పొలాలను పరిశీలించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వరి రైతులు కోరుతున్నారు. ● **వెదురుకుప్పం: మొంథా తుఫాన్ నేపథ్యంలో వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో ముసురు వానతో జనజీవనం స్తంభించింది. రోజువారీ కూలీలు పనులు** లేక ఇంటికే పరిమితమయ్యారు. వాగులు, వంకలు ప్రవహించాయి. ఇప్పటికే నూరుశాతం నిండిపోయిన చెరువులు వాటి కలుజులు ప్రవహిస్తున్నాయి. వెదురుకుప్పం మండలం యనమలమంద సమీపంలో రెండు చోట్ల రోడ్లపై వాగుల ప్రవాహం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జీడీనెల్లూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి మరకాలకుప్పం సుధాకర్ ఆర్అండ్‌బీ అధికారులు, కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రమిచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సుధాకర్ తెలిపారు.● ఐరాల: గార్గేయనది పాయ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మెరపవడ్డిపల్లె గ్రామస్తులు దారి లేక అవస్థలు పడుతున్నారు. గ్రామానికి రెండు వైపులా బీరప్పచెరువు నుంచి వచ్చే కలుజు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు ఎటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామానికి ఉన్న ప్రధాన దారి వద్ద వంక మనిషి పీకల లోతులో ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దాటలేని స్థితి ఏర్పడింది. గ్రామానికి ఉన్న ప్రధాన దారి వద్ద శాశ్వతంగా ఓ కాంక్రీట్ వంతెనను నిర్మిస్తే ప్రజల కష్టాలు తొలగిపోతాయని గ్రామస్తులు అధికారులను, పాలకులను వేడుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల కష్టాలను చూసి వంతెనను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా మండలంలోని వరి పంట 90 శాతం మేర నేల వాలి పోయింది. మండల వ్యాప్తంగా 112 హెక్టార్లలో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో 80 శాతం పంట కోత దశకు చేరుకుంది. 32 శాతం పంట పొట్టకర్ర దశలో ఉంది. ఇందులో 90 శాతం వరి పంట పూర్తిగా వర్షార్పణమైంది. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు.



వెదురుకుప్పం: కసవనూరు చెరువుకు నీటికళ, యనమలమంద సమీపంలో రోడ్డుపై వాగు ప్రవాహం, జిల్లా అధికారికి వినతిపత్రమిస్తున్న సుధాకర్ - ఐరాల: మెరపవడ్డిపల్లె ప్రధాన దారి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గార్గేయనది ఓ పాయ, కలుజు పారుతున్న బీరప్పచెరువు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

యాదమరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మరణించినట్లు ఎస్ఐ ఈశ్వర్ తెలిపారు. లక్ష్మయ్యకండ్రిగ పాఠశాల ఎదురుగా, బెంగళూరు నుండి చిత్తూరు వైపు వచ్చే రోడ్డుపై, కుక్కలపల్లి చెరువు వైపు వచ్చే రోడ్డును ఆ వ్యక్తి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడు సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మృతుడికి సుమారు 50 సంవత్సరాలు ఉండవచ్చని, అతని ఆనవాళ్లు ఇంతవరకు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు. మృతుడి గురించి గానీ, అతని కుటుంబ సభ్యుల గురించి గానీ ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే 94409 00684 నెంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని ప్రజలను కోరారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ వివరించారు.

తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

పూతలపట్టు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను వాగులు, వంకల వద్దకు పంపకుండా జాగ్రత్త పడాలని తహసీల్దార్ రమేష్ బాబు అన్నారు. మంగళవారం ఆయన పూతలపట్టు, సామనత్తం, ఆకనంబట్టు గ్రామాల వద్ద వున్న వంకలను రెవిన్యూ సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఈయనతో పాటు మండల సర్వేయర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి టీటీడీ నిధులివ్వడం ఆనందదాయకం

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేస్తు టీటీడీ పాలక మండలి నిర్ణయించడం ఆనందదాయమని ఈవో పెంచలకిషోర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ ముఖ్యకార్యదర్శి హరిజవహర్‌లాల్, కమిషనర్ రామచంద్రమోహన్, స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాక ఆలయ చైర్మన్ మణి నాయుడుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

యువతి అదృశ్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని చావడి వీధికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రెండవ పట్టణ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు. సీఐ కథనం మేరకు... చావడివీధికి చెందిన బ్రహ్మయ్య ఆచారి కుమార్తె దివ్యశ్రీ (22) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో బంధువులు, తెలిసినవారి ఇళ్లల్లో వెతికారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నీటి సరఫరాపై దృష్టి సారించండి

చిత్తూరు అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో నీటిసరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని కమిషనర్ నరసింహప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి నీటిసరఫరా, పారిశుద్ధ్యం, రోడ్ల విస్తరణ, తోటట్టు ప్రాంతాల్లో తాజా పరిస్థితిపై తనిఖీ చేశారు.

రోజంతా ముసురువాన

● స్తంభించిన జనజీవనం



ముసురువానతో గొడుగుచాటున వెళుతున్న జనం - బహుదానదిలో నీటి ప్రవాహం


చిత్తూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం నగరంలో ముసురువానతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దాంతో జన జీవనం స్తంభించింది. ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు పడుతూనే ఉండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలు, కళాశాలలకు ముందుగానే సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల తాకిడి లేకపోయినప్పటికీ పనుల నిమిత్తం నగరానికి వచ్చిన ప్రజలు వర్షంతో తడుస్తూనే వెళ్లారు. రోడ్ల పక్కన చిరు వ్యాపారులకు వ్యాపారాల్లేకుండా పోయాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి వచ్చిన ప్రయాణికులకు సరైన బస్టాప్ లేకపోవడంతో గాంధీ సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్, దర్గా సర్కిళ్లలో తడుస్తూనే బస్సుల కోసం ఎదురు చూశారు. వీధులన్నీ బురదమయంగా తయారయ్యాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఓ చెట్టు కూలిపోయింది. ఎలాంటి నష్టం జరగలేదు. చిత్తూరు ప్రజల దాహార్తిని తీర్చే ఎన్టీఆర్ జలాశయం కొన్ని రోజులుగా పడుతున్న వర్షాలతో పూర్తిగా నిండిపోయింది. ఇప్పటికే నాలుగు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. అవసరాన్ని బట్టి మరిన్ని గేట్లను ఎత్తుతామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఇల్లుకోల్పోయిన బాధితులను ఆదుకుంటాం

● ప్రభుత్వ విప్ థామస్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నియోజకవర్గంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గంగాధరనెల్లూరు మండలం ముక్కళత్తూరు దళితవాడలో నివశిస్తున్న రాజేశ్వరి పూరిగుడిసె కోల్పోయినందుకు మంగళవారం అధికారులు, టీడీపీనేతలతో కలిసి ప్రభుత్వం తరపున రూ.50వేలు చెక్‌ను థామస్ బాధితురాలికి అందజేశారు. అదే విధంగా బంగారెడ్డిపల్లె పంచాయతీ శెట్టిపారం గ్రామానికి వెళ్లే దారిలో నీటి ప్రవాహానికి కల్వర్టు పక్కన కోతకు గురైన మట్టిరోడ్డును, నిండిపోయిన ఆత్మకూరు చెరువును థామస్ పరిశీలించారు. టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, ముప్పిరి మోహన్‌నాయుడు, స్వామిదాస్, ప్రభాకర్‌నాయుడు, కామసాని కోదండరెడ్డి, హరీష్‌యాదవ్, ప్రసాద్‌నాయుడు, దీపక్‌నాయుడు, ఇందిరమ్మ, కార్జాల అరుణ, రుద్రయ్యనాయుడు, చెంగల్రాయ యాదవ్, గజేంద్రనాయుడు, అరుల్‌నాథన్, జాన్, ఇమ్మానువేల్, అధికారులు పాల్గొన్నారు.

నేలకూలిన చెట్టు... విద్యుత్ సరఫరాకు అంతరాయం



తహసీల్దార్ కార్యాలయంలో పడిపోయిన చెట్టు

చిత్తూరు రూరల్ అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మంగళవారం తెల్లవారు జామున చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న పెద్ద చెట్టు పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌పై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అర్బన్ ఈఈ మునిచంద్ర సంఘటనా స్థలం వద్దకు వచ్చి మరమ్మతు పనులు చేయించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అలాగే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యుత్ లైన్లను తనిఖీ చేశారు. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం నగరంలోని పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేసి, సిబ్బందికి సూచనలు చేశారు.

కట్టమంచి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగరపరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న కట్టమంచి చెరువులో మంగళంవారం ఓ మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని స్థానికులు అందించిన సమాచారం మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కట్టమంచి చెరువు వద్దకు చేరుకున్నారు. పసుపు చొక్కా ధరించిన 55 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి మృతదేహం చెరువు గట్టు పక్కన కనిపించిందన్నారు. మృతదేహాన్ని బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ మహేశ్వర తెలిపారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉబ్బిపోయిందన్నారు. కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కలవగుంట బ్రిడ్జి లింక్ రోడ్డుకు మరమ్మతులు

పెనుమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు మండలంలోని కలవగుంట వద్ద ఉన్న ఎన్టీఆర్ జలాశయం బ్రిడ్జిపైన లింక్ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. బురదగా మారి వాహనదారులు పడిలేచి వెళ్తున్నారు. దీంతో మంగళవారం వెట్‌మిక్స్ తోలి రోడ్డును బాగుచేశారు. శనివారం బురదమయంగా ఎన్టీఆర్ జలాశయం రోడ్డు అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు జలవనరుల శాఖ అధికారులు స్పందించారు. వారు మండలంలోని స్టోన్‌క్రషర్ యజమానులతో మాట్లాడి సుమారు 270 యూనిట్ల వెట్‌మిక్స్‌ను తోలి ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి రోడ్డును బాగుచేశారు. దాతలు హరిబాబు నాయుడు, యువరాజులు నాయుడు, ప్రకాష్ నాయుడు తమ వాహనాలతోనే రోడ్డును బాగు చేయించారు.

ప్రాజెక్టులో నీరు నిల్వ చేయండి



కృష్ణాపురం రిజర్వాయర్‌ను చూస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా

వెదురుకుప్పం, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కృష్ణాపురం రిజర్వాయర్‌కు వచ్చే వరద నీటిని వృథా కానీయకుండా నిల్వ చేయాలని మొంథా తుఫాన్ జిల్లా ప్రత్యేక అధికారి గిరీషా తెలిపారు. మంగళవారం కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్‌ను ఆయన పరిశీలించారు. రహదారి నిర్మాణం పనుల కోసం నివేదికలు సిద్ధం చేయాలని, పటిష్టమైన నిర్మాణం పనులు చేపట్టాలని ఆదేశించారు. నగరి ఆర్డీవో అనుపమ, ఏఈఈ భాస్కరరాజీవ్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విద్యావతి, మురళీకుమార్ పాల్గొన్నారు.

మండల వైసీపీ బీసీ కార్యవర్గం ఎంపిక



వేలు మొదలి, చిట్టిబాబు మొదలి

గంగాధరనెల్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండల వైసీపీ బీసీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ కె.ఆర్.వెంకటరెడ్డి తెలిపారు. మండల వైసీపీ బీసీ కార్యవర్గం అధ్యక్షుడిగా ఎం.వేలు మొదలి, ఉపాధ్యక్షుడిగా కె.చిట్టిబాబు మొదలి ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు.

సంతాపం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవెంకటాపురం దళితవాడకు చెందిన వైసీపీ నేత అములునాధన్ అలియాస్ అములు (47) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మరణించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ కృపాలక్ష్మి, మండల కన్వీనర్ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

నగరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 4 నెలల జీతాలను వెంటనే చెల్లించాలని, జీవో నెంబరు 549 ప్రకారం రూ.16,000 వేతనాలు అందించాలని ఏఐటీయూసీ జిల్లా సమితి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బకాయి ఉన్న జీతాల కోసం సంబంధించిన కాంట్రాక్టర్ ఫోను చేసినా స్పందించడం లేదన్నారు. జిల్లా అధికార యంత్రం చొరవ తీసుకుని జీతాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, నగరి ఏరియా ఆస్పత్రి శానిటేషన్ వర్కర్స్ నాయకులు నగోమి, సభ్యులు రాజేష్, ఆశ, ఉష, సుజాత, సెల్వీ పాల్గొన్నారు.